# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 16-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో 2027 జనగణన ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభం కానుంది.**

2. **మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

3. **ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ బిల్లు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

4. **వడదెబ్బ బాధితుల కోసం అన్ని ఆసుపత్రుల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.**

5. **ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఈరోజు.**

=========================

ఆంధ్రప్రదేశ్‌లో 2027 జనగణన ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో ఇళ్ళ జాబితా, గృహాల గణన చేపట్టనున్నారు. ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించటంతో పాటు స్వీయ-గణన సదుపాయం కల్పించారు. మొదటి దశలో భాగంగా స్వీయ-గణన సదుపాయం ఈరోజు నుండి ఈ నెల 30 వ తేది వరకు 15 రోజులపాటు అందుబాటులో ఉంటుంది. అనంతరం ఇళ్ళ జాబితా, గృహ గణన మే 1 నుండి 30 వ తేది వరకు 30 రోజులపాటు నిర్వహించనున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జనగణన కార్యకలాపాల సంచాలకులు జె.నివాస్ నిన్న మాట్లాడుతూ..

వాయిస్ ..30.. సెకన్లు

-------------------------

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో నిర్వహించిన 'మారుతున్న వాతావరణ పరిస్థితులు – సుస్థిర వరి వ్యవసాయం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేస్తామని, తద్వారా మరిన్ని ఎకరాలకు సాగునీరు అందుతుందని

చెప్పారు. మార్టేరు వంటి వ్యవసాయ పరిశోధన కేంద్రాలు సుస్థిర పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తూ మార్గనిర్దేశం చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ శాఖ పనులపై ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దృశ్య మాధ్యమం విధానం ద్వారా జిల్లాల వారీగా గృహాల నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, భూసంబంధిత సమస్యలు, నిర్మాణ సామగ్రి సరఫరా వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ నిర్మాణ పనుల్లో ఎటువంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు పారదర్శకంగా, సమయానికి గృహాల కేటాయింపు జరగాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

వేసవి దృష్ట్యా వడదెబ్బ బాధితులకు సత్వర చికిత్స అందించేందుకు తెలంగాణలోని అన్ని ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్యబృందాలను ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్‌పేషెంట్లు, ఇన్‌పేషెంట్లు, వారి సహాయకులకు, ఆసుపత్రి సిబ్బందికి తాగునీరు అందుబాటులో ఉంచాలని అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

“ప్రధానమంత్రి సూర్యఘర్” పథకం ద్వారా ప్రజలకు విద్యుత్ బిల్లు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం గోపవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో “సూర్యాంధ్ర ప్రగతి రథాల”ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పూర్తిగా సౌర ఫలకాలను ఉచితంగా అందిస్తున్నామని పేర్కొంటూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఈ తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మృతి చెందగా పలువురు గాయపడ్డారు. జిల్లాలోని మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద బొలెరో వాహనం- లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని క్షతగాత్రులను చికిత్స కోసం ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ఈ ప్రమాదంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

---------------------------

ఎగుమతి, దిగుమతి సామర్థ్యాలు పెంచే విధంగా కృష్ణపట్నం పోర్టు విస్తరణ పనులు చేపట్టామని ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టును ఆయన నిన్న పరిశీలించారు. పోర్టు విస్తరణ పనులు, కంటెయినర్ టెర్మినల్ పునరుద్ధరణ వంటి సదుపాయాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోర్టు కార్యకలాపాలు పెరగడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఈసందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ప్రముఖ సంఘ సంస్కర్త, ఆధునిక సాహిత్య యుగ వైతాళికులు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఈరోజు. 1848వ సంవత్సరం ఏప్రిల్ 16వ తేదీన రాజమహేంద్రవరంలో వీరేశలింగం జన్మించారు. ఆయన రాసిన ఆంధ్ర కవుల చరిత్ర, స్వీయ చరిత్ర బహుళ ప్రచారం పొందాయి. 1881 సంవత్సరంలో మొదటి వితంతు వివాహం జరిపించారు. 1919 సంవత్సరం మే 27వ తేదీన అప్పటి మద్రాసులో ఆయన కన్నుమూశారు. తెలుగు నాటకరంగ పితామహులు, తొలి నాటకకర్త, ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007 నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్వహిస్తోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలోని 275 మండలాల్లో నిన్న 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, నంద్యాల జిల్లా సంజామలలో అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత 44.6 డిగ్రీలుగా నమోదైందని తెలిపింది. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది.

తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈరోజు వడగాలులు వీస్తాయని ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న ధాన్యం కొనుగోలు నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు.

====================